యాప్.. కష్టాలకు స్టాప్

- ఫోన్ చేస్తే చాలు.. టెక్నీషియన్లు ఇంటికొచ్చేస్తారు
- ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తెచ్చిన మెప్మా
- వచ్చే నెలలో వినియోగంలోకి రానున్న సేవలు



సీటీఆర్ఐ: ఇంట్లో ట్యాప్ లీకవుతుందా? మరమ్మతుల కోసం ప్లంబర్‌ని వెతుకుతున్నారా? ఏసీ పనిచేయడం లేదని టెక్నీషియన్ల కోసం ఆరా తీస్తున్నారా..? ఇటువంటి అవసరాలకు ఇకపై ఎవరినీ వెతుక్కోవాల్సిన అవసరం లేదు. చేతిలో ఉన్న స్మార్ట్ ఫోన్‌లో యాప్ డౌన్‌లోడ్ చేసుకుని, ఒక్క ఫోన్‌కాల్ చేస్తే చాలు. నేరుగా ఇంటికి వచ్చి, మరమ్మతులు చేసి, వాటి చార్జీల మొత్తం తీసుకుంటారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో మెప్మా సమన్వయంతో హోం ట్రైయాంగిల్ పేరిట ప్రత్యేక యాప్‌ను అంటుబాటులోకి తీసుకొచ్చారు. వివిధ రంగాల నైపుణ్య పనివార్లను ఇందులో భాగస్వాములను చేస్తున్నారు.

అర్బన్ ప్రాంతాల్లో గృహ అవసరాల కోసం హోమ్ ట్రైయాంగిల్ పేరుతో ఈ ప్రత్యేక యాప్‌ను సిద్ధం చేశారు. స్మార్ట్ ఫోన్‌లోని ప్లే స్టోర్‌లోకి వెళ్లి, ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఆ తర్వాత మొబైల్ నంబరు, ఇంటి చిరునామా తదితర వివరాలను అందులో నమోదు చేయాలి. ఫోన్ నంబర్ ఆధారంగా లొకేషన్ సేవ్ అవుతుంది.

ఇలా వినియోగించుకోవచ్చు

ఇంట్లో విద్యుత్, పైపులైన్లు, పరికరాల పరంగా సాంకేతిక సమస్యలు తలెత్తినప్పుడు దీనిని వినియోగించుకోవచ్చు. నేరుగా యాప్ క్లిక్ చేస్తే.. మెనూ ఓపెన్ అవుతుంది. అందులో సమస్యను ప్రస్తావించాల్సి ఉంటుంది. ఉదాహరణకు ఎలక్ట్రీషియన్ అవసరం ఉంటే.. ఆ ఐచ్ఛికను క్లిక్ చేయాలి. దీంతో వెంటనే అందుబాటులో ఉండే ఎలక్ట్రీషియన్ వివరాలు, ఫోన్ నంబర్లు సెల్‌ఫోన్‌లో కనిపిస్తాయి. అలాగే ప్లంబర్, ఎలక్ట్రీషియన్, సెలూన్, టీవీ, గ్యాస్‌స్టౌ రిపేర్లు ఇలా పలు రకాల సేవలందించడానికి యాప్‌లో ఆయా నైపుణ్య పనివార్ల నంబర్లు ఉంటాయి. వారితో నేరుగా మాట్లాడి వివరాలను తెలుసుకునే సౌలభ్యం కూడా ఉంది.

ఈ సేవలు పొందవచ్చు

బ్యూటీ పార్లర్‌కు వెళ్లేవారు నేరుగా ఇంటి వద్దే ఆయా సేవలను పొందవచ్చు. నగరంలో పేరున్న సంస్థలు, బ్యూటీ పార్లర్ల వివరాలు అందుబాటులో ఉంటాయి. పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలకు సంబంధించి ఈవెంట్ సంస్థల వివరాలు యాప్‌లో ఉంటాయి. పెంపుడు జంతువులకు స్నానం చేయించి, శుభ్రం చేయడం దగ్గర నుంచి హౌస్ క్లీనింగ్ వరకు అన్ని రకాల సేవలకు సంబంధించిన వారి వివరాలు యాప్‌లో పొందవచ్చు.

తొలి విడత శిక్షణలో..

రాజమహేంద్రవరం అర్బన్ పరిధిలో ఎలక్ట్రీషియన్లు, టీవీ టెక్నీషియన్లు, ఏసీ, ఫ్రిజ్, వాషింగ్ మెషీన్, ప్లంబర్, కార్పెంటర్, లేడీస్, జెంట్స్ సెలూన్లు తదితర వాటిలో ప్రావీణ్యం ఉన్నవారు 381 మంది ఇందులో నమోదు చేయించుకున్నారు. వీరికి ఐదు రోజుల పాటు శిక్షణ ఇచ్చి, అనంతరం వీరి పేర్లు, ఫోన్ నంబర్లు తదితర వాటిని యాప్‌లో నమోదు చేస్తారు. ఉభయ గోదావరి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కోడ్ పూర్తయిన తరువాత మార్చి 8వ తేదీన ఈ యాప్‌ని అందుబాటులోకి తెచ్చేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

280 మందిని నమోదు చేయించాం



గోదావరి ఎలక్ట్రికల్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో 250 మంది వర్కర్స్‌ను మెప్మాలో నమోదు చేయించాం. రోజువారీ పనుల కోసం సెంటర్‌లో నిలబడి పని కోసం ఎదురుచూడడం, ఎవరైనా వచ్చి పని ఇస్తారా అంటూ వెతుక్కోవడం జరుగుతుంది. చాలా మందికి వర్కర్స్ అవసరమున్నా, సెంటర్‌కి వచ్చి తీసుకుని వెళ్లడానికి కొంచెం టైమ్ పడుతుంది. అదే ఫోన్‌లో నంబర్ చూసి అడ్రస్ చెబితే, వర్కర్స్ ఇంటికి వెళ్లి పని చేస్తారు. దీనివల్ల చాలా సమయం కలిసి వస్తుంది.

– బొజ్జ రామకృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, గోదావరి ఎలక్ట్రికల్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్

పని సరళమవుతోంది



ఏ సెంటర్‌లో పని కావాలంటే ఆయా సెంటర్‌లోని వర్కర్స్‌ని తీసుకుంటారు. దీనివల్ల యాజమానికి వర్కర్స్ కోసం తిరగాల్సిన పని లేదు. పైగా ఆయా సెంటర్లలోని వర్కర్స్ కావడం వల్ల ఇబ్బంది ఏమీ ఉండదు. యూపీ, బీహార్, ఒడిశా నుంచి పనివాళ్లు వచ్చి, ఆయా పనులను చేస్తుండటంతో మాకు పని తగ్గిపోతోంది. ఈ యాప్ వల్ల ఇక్కడి వర్కర్స్‌కు పని పెరిగే అవకాశాలున్నాయి.

– గోవాడ కొండబాబు, ఎలక్ట్రీషియన్

లారీ డ్రైవర్‌పై ముసుగు వ్యక్తుల దాడి

– నగదు, సెల్‌ఫోన్లు లాక్కుని పరార్



గాయపడిన డ్రైవర్ చంద్రుడు

రాజమహేంద్రవరం రూరల్: దివాన్‌చెరువు పండ్ల మార్కెట్ సమీపంలో రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీ డ్రైవర్‌పై ముసుగు ధరించిన ముగ్గురు వ్యక్తులు దాడి చేశారు. అతని వద్ద రూ.7,800 నగదు, రెండు సెల్‌ఫోన్లు లాక్కుని పరారయ్యారు. గురువారం తెల్లవారుజామున జరిగిన ఈ సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ప్రకాశం జిల్లా కొమరోలు గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ వర్రా చంద్రుడు, క్లీనర్‌తో కలిసి రావులపాలెంలో బుధవారం రాత్రి జొన్నల లోడును దించారు. అక్కడి నుంచి జీడితుక్కు లోడు వేసుకునేందుకు వెళ్తూ, చిరునామా తెలియక దివాన్ చెరువు పండ్ల మార్కెట్ దాటాక రోడ్డు పక్కన లారీని ఆపారు. గురువారం తెల్లవారుజామున 3.30 సమయంలో మంకీ క్యాప్ ధరించిన వ్యక్తి బైక్‌ను లారీకి అడ్డుగా పెట్టాడు. లారీ డ్రైవర్ చంద్రుడును అతడు అగ్గిపెట్టె అడిగాడు. లేదని చెప్పడంతో, తమ వారికి ఫోన్ చేసుకునేందుకు సెల్‌ఫోన్ ఇవ్వాలని కోరాడు. ఫోన్ కూడా లేదని లారీడ్రైవర్ చెప్పగా, మరో ఇద్దరు ముసుగులు ధరించిన వ్యక్తులు లారీ క్యాబిన్ ఎక్కి, డ్రైవర్ తలపై సుత్తిలాంటి వస్తువుతో కొట్టి, జేబులోని నగదు, రెండు సెల్‌ఫోన్లు తీసుకుని మోటార్ సైకిల్‌పై పరారయ్యారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బొమ్మూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అసత్య ప్రసారాలపై కేసు నమోదు

కంబాలచెరువు: అసత్య వార్తలు ప్రసారం చేస్తున్న యూట్యూబ్ ఛానళ్లపై మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. పోలీసుల వివరాల మేరకు, రాజమహేంద్రవరంలో కొందరు యూట్యూబ్ ఛానళ్లు నిర్వహిస్తూ, విలేకరులుగా చలామణి అవుతున్నారు. సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టి, బెదిరింపులకు పాల్పడుతున్నారు. దీనిపై రాజమహేంద్రవరం ప్రెస్‌క్లబ్ ట్రెటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఓఎన్‌జీసీ ఉద్యోగి బలవన్మరణం

కంబాలచెరువు: నగరంలోని స్థానిక గాంధీపురం భవ్య అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న ఓఎన్‌జీసీ ఉద్యోగి సునీల్(55) గురువారం ఇంటిలో ఫ్యానుకు ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. దీనిపై స్థానికంగా నివాసం ఉండే పి.వెంకటేశ్వరరావు అనే వ్యక్తి పోలీసులకు సమాచారం అందించాడు. మధ్యాహ్నం సమయంలో సునీల్ ఇంటికి వెళ్లాడని, ఆ సమయంలో ఉరి వేసుకుని ఉండవచ్చని భావిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఆస్పత్రిలో బంగారం మాయం

కంబాలచెరువు: వైద్యానికి వెళ్లిన రోగి బంగారం స్థానిక ఎస్ఆర్ ట్రస్టు ఆస్పత్రిలో మాయమైన సంఘటనపై టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. గోదావరి గట్టు సమీపంలో నివసించే రమాదేవి వైద్యం కోసం ఆస్పత్రిలో చేరింది. ఈ నెల 6న ఐసీయూలో దుస్తులు మార్చే క్రమంలో మెడలోని నాలుగు కాసుల బంగారు చైన్ మాయమైంది. దీనిపై ఆమె భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కౌమార దశపై అవగాహన ఉండాలి



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ బిందు శ్రీదేవి

రాజమహేంద్రవరం రూరల్: స్త్రీ జీవితంలో కౌమార దశ అత్యంత ముఖ్యమైనదని, దీనిపై అవగాహన కలిగించుకోవాల్సిన అవసరం ఉందని డాక్టర్ బిందు శ్రీదేవి అన్నారు. రాజమహేంద్రవరంలోని సత్యసాయి గురుకులంలో గురువారం విద్యార్థినులకు కౌమార దశపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బిందు శ్రీదేవి మాట్లాడుతూ, విద్యార్థినిగా ఉన్నప్పుడే కౌమారంలోని అనేక సమస్యలను బాలికలు ఎదుర్కొంటున్నారన్నారు. తమ వయస్సుతో పాటు, శారీరక, మానసిక మార్పులను గమనిస్తూ, వాటిని ఏ విధంగా ఎదుర్కొనాలనే అంశంపై అవగాహన కల్పించారు. విద్యార్థినులు తమ సమస్యలను తల్లులకు లేదా మహిళా ఉపాధ్యాయులకు తెలియజేసి, వాటిని నివృత్తి చేసుకోవాలని సూచించారు. డాక్టర్ అనిక మాట్లాడుతూ, సామాజిక మాధ్యమాలను అనుసరిస్తూ అపోహలకు లోను కావొద్దని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గోలి రామారావు, గురుకులం కరస్పాండెంట్ శ్యాంసుందర్, ప్రిన్సిపాల్ కె.గురయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎర్న్‌డ్ లీవులను నమోదు చేయండి

కంబాలచెరువు: ఉపాధ్యాయులకు తహసీల్దార్ ఇచ్చిన డ్యూటీ సర్టిఫికెట్ల ఆధారంగా సర్వీస్ రిజిస్టర్లలో ఎర్న్‌డ్ లీవులను నమోదు చేయాలని ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు అర్బన్ ఎంఈవో, డీఐ దిలీప్‌కుమార్‌ను కోరారు. రాబోయే ఎస్ఎస్‌సీ పబ్లిక్ పరీక్షలకు డీఓలుగా మున్సిపల్ ఉపాధ్యాయులను కూడా పరిగణనలోకి తీసుకోవాలని డీవైఈవో కార్యాలయంలో వారు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎ.ఉదయ బ్రహ్మం, జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీవీ సత్యనారాయణ, జిల్లా గౌరవాధ్యక్షులు వి.అప్పయ్య శాస్త్రి, జిల్లా అధ్యక్షులు డేవిడ్ లివింగ్‌స్టన్, జిల్లా అదనపు కార్యదర్శి, జీఎస్ఎస్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పరిశీలన గృహానికి తరలింపు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): హత్యాయత్నం, గంజాయి కేసులో బాల నేరస్తుడిని ఏడాది పాటు ప్రత్యేక పరిశీలన గృహానికి తరలించాలని జువైనల్ జస్టిస్ బోర్డు ప్రిన్సిపల్ మేజిస్ట్రేట్ రమ్య చావలి గురువారం తీర్పు చెప్పారు. స్థానిక మంగళవారపుపేటలోని జమాయిల్ ప్రసూతి ఆస్పత్రి వద్ద 2022 జూన్ 5న టాటూ వివాదంలో బొత్సా హరీష్‌పై బాలుడు కత్తితో దాడి చేశాడు. దీనిపై అప్పటి సీఐ నవీన్‌కుమార్ కేసు నమోదు చేశారు. అతని వద్ద పది గ్రాముల గంజాయిని కూడా స్వాధీనం చేసుకున్నారు. దీనిపై జువైనల్ జస్టిస్ బోర్డు కోర్టు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజశేఖర్ ప్రాసిక్యూషన్ తరఫున వాదించారు. కేసు విచారణ అనంతరం, నేరం రుజువు కావడంతో బాలుడిని విశాఖపట్నంలోని ప్రత్యేక పరిశీలన గృహానికి తరలించారు.

ఆపరేషన్ కగార్‌ను బేషరతుగా ఆపేయాలి

ప్రకాశం నగర్: దేశంలోని అటవీ ప్రాంతాల్లో ఉన్న ఖనిజ సంపదను కార్పొరేట్ సంస్థలకు అప్పగించడానికి ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్రం చేస్తున్న చర్యలను వ్యతిరేకిస్తూ రాష్ట్రవ్యాప్త ఆందోళనలో భాగంగా గురువారం స్థానిక గోకవరం బస్టాండ్ అంబేడ్కర్ బొమ్మ సెంటర్ వద్ద వివిధ వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు జె.సత్తిబాబు, పీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌కే మస్తాన్, పీఓడబ్ల్యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లిక, కేవీపీఎస్ నాయకులు కోనాల లాజర్, న్యూడెమోక్రసీ నగర కార్యదర్శి కె.జోజి తదితరులు మాట్లాడుతూ, దేశ సంపదను సామ్రాజ్యవాదులకు కట్టబెట్టేందుకు ఆపరేషన్ కగార్ పేరుతో వేల మందిని హతమారుస్తున్నారని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మోదీ పాలన ప్రజల కోసమా లేక కార్పొరేట్ల కోసమా అని ప్రశ్నించారు. ప్రస్తుతం బీజాపూర్‌లో కొనసాగుతున్న మారణహోమాన్ని ఆపాలని డిమాండ్ చేశారు.

వేగంగా రోడ్డు విస్తరణ పనులు

కమిషనర్ కేతన్‌గార్గ్



రోడ్డు విస్తరణ పనులపై చర్చిస్తున్న కమిషనర్

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో రోడ్డు విస్తరణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. గురువారం రోడ్ల విస్తరణ పనులను అధికారులతో కలసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మాస్టర్ ప్లాన్ ప్రకారం రెండు కిలోమీటర్ల ఈస్ట్ రైల్వే స్టేషన్ రోడ్డును ప్రస్తుతమున్న 40 అడుగుల నుంచి 80 అడుగులకు విస్తరించేందుకు రోడ్డు అభివృద్ధి ప్రణాళిక రూపొందించామన్నారు. నగరంలో మొత్తం ప్రభావిత భవనాలు, స్థలాలు సుమారు 200 ఉన్నాయని, వీటిని 4 దశలుగా విభజించి పనులు చేపడుతున్నామని వివరించారు. భవన, స్థల యజమానులతో సమావేశమై, విస్తరణకు సంబంధించిన భూసేకరణకు టీడీఆర్ అందజేస్తామని తెలిపారు. అందరూ సహకరించాలని కోరారు.

కాంట్రాక్ట్ డ్రైవర్ల కష్టాన్ని దోచుకుంటున్న కాంట్రాక్టర్లు

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అరుణ్
- ఓఎన్‌జీసీ బేస్ కాంప్లెక్స్ వద్ద ధర్నా



ఓఎన్‌జీసీ బేస్ కాంప్లెక్స్ వద్ద ధర్నా చేస్తున్న కాంట్రాక్టు డ్రైవర్లు, నాయకులు

రాజమహేంద్రవరం రూరల్: ఓఎన్‌జీసీ బేస్ కాంప్లెక్స్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు డ్రైవర్ల కష్టాన్ని కాంట్రాక్టర్లు, ఓ యూనియన్ నాయకుడు దోచుకుంటున్నారని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు టి.అరుణ్ ఆరోపించారు. గురువారం స్థానిక ఓఎన్‌జీసీ బేస్ కాంప్లెక్స్ మెయిన్ గేటు వద్ద ఓఎన్‌జీసీ కాంట్రాక్ట్ డ్రైవర్స్, సీఐటీయూ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణ్ మాట్లాడుతూ, ఓఎన్‌జీసీ కేజీ బేసిన్ రాజమండ్రి అసెట్‌లో 350 మందికి పైగా డ్రైవర్లు కాంట్రాక్టు వర్కర్లుగా పనిచేస్తున్నారని తెలిపారు. యాజమాన్యంతో కుదుర్చుకున్న ఒప్పందానికి కాంట్రాక్టర్లు తూట్లు పొడుస్తున్నారన్నారు. సెంట్రల్ లేబర్ డిపార్ట్‌మెంట్ నిర్దేశించిన కనీస వేతనంతో పాటు, అదనంగా 35 శాతం ఫెయిర్ వేజ్, రోజుకు రూ.50, సెలవు జీతం, బోనస్, పీఎఫ్, ఈఎస్ఐ, బీమా తదితర సౌకర్యాలు ఇచ్చేందుకు అంగీకరించిన వారికే టెండర్లు వేసేందుకు అనుమతి ఉందని చెప్పారు. రెండేళ్ల క్రితం వరకూ నెలకు రూ.22 వేల నుంచి రూ.25 వేల వేతనం కాంట్రాక్టు డ్రైవర్లు తీసుకునే వారని తెలిపారు. కొత్త కాంట్రాక్టర్ రెండేళ్లుగా కేవలం నెలకు రూ.14 వేలు మాత్రమే చెల్లిస్తున్నారన్నారు. 2021లో కుదిరిన అగ్రిమెంట్ ప్రకారం కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన కనీస వేతనం నెలకు రూ.27,248 ఇవ్వాల్సి ఉందన్నారు. అదనంగా ఓవర్ టైమ్, నెలకు ఒకటిన్నర రోజుల జీతంతో కూడిన సెలవు, ఏడాదికి నెల జీతం బోనస్‌గా ఇవ్వాల్సి ఉందని వివరించారు. కార్మికులను దోపిడీ చేసి కాంట్రాక్టర్లు జేబులు నింపుకొంటున్నారని మండిపడ్డారు. తమ కష్టానికి తగ్గ కనీస వేతనం ఓఎన్‌జీసీ నిబంధనల ప్రకారం ఇవ్వాలని అడిగినందుకు నలుగురి ఉద్యోగాలను నిలుపుదల చేశారని విమర్శించారు. ఇంత జరుగుతున్నా యాజమాన్యం చోద్యం చూస్తోందన్నారు. తక్షణమే కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకుని, డ్రైవర్లకు కనీసం వేతనంతో పాటు, ఫెయిర్ వేజ్ చెల్లించాలని డిమాండ్ చేశారు. నిలుపుదల చేసిన కార్మికులను వెంటనే పనిలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్సీ సంఘీభావం

కాంట్రాక్టు డ్రైవర్ల ఆందోళనలో పాల్గొన్న ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరావు తన సంఘీభావాన్ని ప్రకటించారు. ఓఎన్‌జీసీ వంటి కేంద్ర ప్రభుత్వ సంస్థలో కూడా చట్టాలు, ఒప్పందాలు అమలు కాకపోవడం దుర్మార్గమన్నారు. తొలగించిన కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన ఓఎన్‌జీసీ పూర్తి భిన్నంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. తక్షణమే కాంట్రాక్టరుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనకు పేపరు మిల్లు, హార్లిక్స్ ఫ్యాక్టరీ కార్మికులు మద్దతు తెలిపారన్నారు. రాబోయే రోజుల్లో ఆందోళనను తీవ్రతరం చేస్తామన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎస్ఎస్ మూర్తి, కేఎస్‌వీ రామచంద్రరావు, బి.పవన్, కర్రి రామకృష్ణ, బి.పూర్ణిమరాజు, పడాల రామకృష్ణ, ఆర్ రామకృష్ణ, దుర్గాప్రసాద్, రామకృష్ణ, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి జువ్వల రాంబాబు, హాస్పిటల్స్ యూనియన్ కార్యదర్శి శ్రీనివాస్, డీవైఎఫ్ఐ నాయకులు వి.రాంబాబు, టి.రాజేష్, కాంట్రాక్ట్ డ్రైవర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

కడియం: కొత్తగా 11 కేవీ వీసీబీ ఏర్పాటు పనుల్లో భాగంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ దాట్ల శ్రీధర్‌వర్మ తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఈ అంతరాయం కలుగుతుందన్నారు. దీంతో కడియపులంక విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని అన్ని 11 కేవీ ఫీడర్లకు సరఫరా ఉండదన్నారు. కడియపులంక, బుర్రిలంక, వెంకాయమ్మపేట, పొట్టిలంక గ్రామాల్లోని వ్యవసాయ మోటార్లకు సరఫరా జరగదని వినియోగదారులు గమనించాలన్నారు.

నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌కు సన్మానం



ఏసును సత్కరిస్తున్న సంఘ సభ్యులు

సీటీఆర్ఐ: నాయీ బ్రాహ్మణ సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ యానాపు ఏసు అన్నారు. గురువారం స్థానిక సీటీఆర్ఐలోని నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఏసు మాట్లాడుతూ, సంఘ సమస్యలను పరిష్కరించడానికి తాను ముందుంటానన్నారు. పదవిని బాధ్యతగా, తన తోటి వారి సమస్యలను తీర్చడానికి గౌరవంగా భావిస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు కొర్రిపాటి సత్యనారాయణ, సెక్రటరీ తోనంగి శివశంకర్, కోశాధికారి అసత్తు సత్యనారాయణ, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

శివరాత్రి ఏర్పాట్లు పరిశీలించిన డీఎస్పీ



కడియపులంకలో సూచనలు చేస్తున్న డీఎస్పీ భవ్యకిషోర్

కడియం: రానున్న శివరాత్రి వేడుకల నేపథ్యంలో మండలంలోని కడియపులంకలో ఉన్న అపర్ణా సమేత అనంతేశ్వర స్వామివారి ఆలయం వద్ద ఏర్పాట్లపై దక్షిణ మండలం డీఎస్పీ భవ్యకిషోర్ గురువారం సమీక్షించారు. కడియం ఇన్‌స్పెక్టర్ ఎ.వేంకటేశ్వరరావుతో కలిసి ఆలయ చైర్మన్ మార్గాని సత్యనారాయణతో ఏర్పాట్లపై చర్చించారు. ఆలయం వద్ద తీసుకోవాల్సిన భద్రతాపరమైన చర్యలపై పలు సూచనలు చేశారు. అలాగే ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ బూత్‌లను కూడా డీఎస్పీ పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు.

నాణ్యతా ప్రమాణాలతో రోడ్డు నిర్మించాలి



ఆవ కాలువ రోడ్డును పరిశీలిస్తున్న ఎంపీడీవో

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు గ్రామంలో ఆవ కాలువ వెంబడి నిర్మిస్తున్న రోడ్డును నాణ్యతాప్రమాణాలతో చేపట్టాలని రూరల్ ఎంపీడీవో డి.శ్రీనివాసరావు ఆదేశించారు. గురువారం ఆయన ఈవోపీఆర్డీ ఆర్మ్‌స్ట్రాంగ్‌తో కలిసి ఆవ కాలువ రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ, నేతాజీనగర్ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూ.15 లక్షల మండల పరిషత్ నిధులతో గ్రావెల్ రోడ్డు నిర్మిస్తున్నట్టు చెప్పారు. త్వరితగతిన రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని కాంట్రాక్టరును ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శి జి.కాశీ విశ్వనాథ్, సర్వేయర్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మండల కమిటీ నియామకం

రాజమహేంద్రవరం రూరల్: బీజేపీ ఒకటో మండల అధ్యక్షుడు నాగల శివకుమార్ ఆధ్వర్యంలో మండల కమిటీని గురువారం కొంతమూరు శానిటోరియం వద్ద జరిగిన కార్యక్రమంలో ప్రకటించారు. వైస్ ప్రెసిడెంట్లుగా ఆకుల నరసవేణి, మల్లివలస రాంబాబు, తిప్పర్తి జ్యోతి, సునీత వర్మ, రాయుడు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శులుగా బోటా నాగమణి కండెల్ల సురేష్, కోశాధికారిగా మురముళ్ల ఆనంద్ కుమార్, కార్యదర్శులుగా కోడి నాగలక్ష్మి, వి.దుర్గారావు,, అడపా నాగమణి, గుంజే నాగరాజును నియమించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పలువురు పార్టీలో చేరారు.

తక్షణం న్యాయవాదుల రక్షణ చట్టం చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న న్యాయవాదులు

రాజమహేంద్రవరం సిటీ: కేంద్ర ప్రభుత్వం తక్షణమే న్యాయవాదుల రక్షణ చట్టాన్ని చేయాలని అడ్వకేట్స్ వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్నాలకోట వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో న్యాయవాదులతో కలసి ఆయన వినతిపత్రం అందజేశారు. న్యాయవాదుల రక్షణ చట్టం చేయాలని కోరుతూ అడ్వకేట్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సొసైటీ ప్రతినిధులు, న్యాయవాదులు గురువారం రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ ద్వారా ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు వినతిపత్రాలు పంపించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, దేశంలో రోజురోజుకూ న్యాయవాదులపై దాడులు ఎక్కువ అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వీటిని అరికట్టాలంటే తక్షణం కేంద్రం న్యాయవాదుల రక్షణ చట్టం తీసుకురావాలన్నారు. అలాగే రాష్ట్రంలో అర్హులైన న్యాయవాదులకు రేషన్ కార్డులు, పెన్షన్లు, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు. జూనియర్ న్యాయవాదులకు నెలకు రూ.10 వేల స్టైఫండ్ అందజేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాశీ శ్రీనివాసరావు, రాష్ట్ర సహ కారదర్శి బీర అరుణ్‌కుమార్, రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి సోమిన రామకృష్ణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సిరిపురం గిరీష్, బ్రహ్మజోస్యుల ఫణికుమార్, ఈరేటి బద్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.


సత్తా ఉన్న వారినే గెలిపించండి

కంబాలచెరువు: ప్రజా సమస్యలపై ప్రశ్నించి, పోరాడే సత్తా ఉన్న వారిని గెలిపిస్తే అవి పరిష్కారమయ్యే అవకాశం ఉంటుందని ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు అన్నారు. ఆ సత్తా ఉన్న పీడీఎఫ్ తరఫున పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న దిడ్ల వీరరాఘవులును గెలిపించాలని కోరారు. గురువారం స్థానిక ఆర్ట్స్ కళాశాల, ఎస్‌కే వీటీ డిగ్రీ, కందుకూరి మహిళా కళాశాలతో పాటు, పలు ప్రభుత్వ కార్యాలయాల్లో విస్తృతంగా పర్యటించి, ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఐవీ మాట్లాడుతూ, రాజకీయ పార్టీల మద్దతుతో పోటీలో ఉన్న అభ్యర్థులను గెలిపిస్తే, ఆయా పార్టీలకు మద్దతుగా ఉంటారే మినహా, ఉద్యోగ, ఉపాధ్యాయ, అధ్యాపక, విద్యా సమస్యలపై పోరాడే ఆస్కారం ఉండదన్నారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ లెక్చరర్ల సంఘ నాయకులు రాజు, వీర్రాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజా, వై.భాస్కర్ పాల్గొన్నారు.

నేడు అన్నదానం

కడియం: మండలంలోని దుళ్ల గ్రామంలో ఉన్న శ్రీ భూ సమేత వేంకటేశ్వర స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల ముగింపులో భాగంగా శుక్రవారం భారీ అన్నదానానికి ఏర్పాట్లు చేసినట్లు ఆలయ భక్త బృందం తెలిపింది. దాతల సహకారంతో ఈ కార్యక్రమం జరుగుతుందని పేర్కొంది.

ప్రతి రోజూ డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించాలి : ఎస్పీ



పోలీసుస్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ

కంబాలచెరువు: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతిరోజు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించాలని ఎస్పీ నరసింహ కిషోర్ ఆదేశించారు. స్థానిక ప్రకాష్ నగర్ పోలీస్ స్టేషన్‌ను గురువారం ఆయన తనిఖీ చేశారు. పోలీస్ స్టేషనుకు వచ్చే వారితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. స్కూళ్లు, హోటళ్లు లాంటి ప్రదేశాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. విజిబుల్ పోలీసింగ్ చేయాలని, నేర నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు. రౌడీ షీటర్ల కదలికలపై నిఘా ఉంచాలని సూచించారు. విజిబుల్ పోలీసింగ్, రాత్రి గస్తీని బలోపేతం చేశామని, డ్రంక్ అండ్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్ కేసులు నమోదు చేస్తున్నామని చెప్పారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సినిమాలు



శ్యామల	:	సంక్రాంతికి వస్తున్నాం
సూర్యమినీ	:	కెప్టెన్ అమెరికా
సూర్యప్యాలెస్	:	పట్టుదల
స్వామి	:	బ్రహ్మ ఆనందం
శివజ్యోతి	:	తండేల్
అనుశ్రీ	:	లైలా
రాజా	:	తండేల్
ఊర్వశి	:	కాంప్లికేటెడ్
మేనక	:	నిదిరించు జహాపన
రంభ	:	ఆరెంజ్
కుమారి	:	కెప్టెన్ అమెరికా
అప్సర	:	తండేల్
అశోక నామవరం	:	లైలా
వీఎస్.మహల్ ధవళేశ్వరం	:	తండేల్
మురళీకృష్ణ కడియం	:	తండేల్
వెంకటసూర్య	:	లైలా